సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 1 । జనవరి । 2025



టన్ను చీనీ రూ.27,420

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.27,420, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.9

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.9, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.6 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
33.1°/12.8°

జిల్లా అంతటా మంగళవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న





ప్రశాంతి నిలయం: జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ టీఎస్ చేతన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలందరికీ మేలు జరగాలని, ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జీవించాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ద్వారా నూతన ఏడాది ప్రజలకు సుపరిపాలన అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అందరూ సానుకూల దృక్పథంలో ముందుకు సాగుతూ నూతన విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.
పుట్టపర్తి టౌన్: జిల్లా ప్రజలకు, పోలీసు కుటుంబాలకు, మీడియా మిత్రులకు ఎస్పీ రత్న నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఏడాదిలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలతో రైతులందరూ కళకళలాడాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ మహిళలకు పీఎం అజయ్ పథకం



మాట్లాడుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ

పుట్టపర్తి అర్బన్: పేద ఎస్సీ మహిళలకు పీఎం అజయ్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ పేర్కొన్నారు. అర్హులైన ఎస్సీ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంగళవారం పుట్టపర్తిలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది, డీఆర్‌డీఏ సిబ్బంది , మండల సమాఖ్య సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ పీఎం అజయ్ పథకంలో అర్హులైన ఎస్సీ మహిళలకు వడ్డీ లేని రుణాన్ని అందించనున్నట్లు చెప్పారు. 10 శాతం సభ్యుల వాటా ధనాన్ని సెర్ప్ సీఈఓ రికవరీ ఖాతాకు జమ చేయాల్సి ఉంటుంది. అనంతరం పరిశీలించి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకూ వడ్డీ లేని రుణాన్ని మంజూరు చేస్తారన్నారు. ఇందులో అత్యధికంగా రూ.50 వేల సబ్సిడీ ఉంటుందన్నారు. ఈ మొత్తాన్ని సద్వినియోగం చేసుకొని కుటుంబాలను ఆర్థికంగా వృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం ఎల్‌హెచ్ రామమోహన్, డీపీఎం ఫైనాన్స్ రామిరెడ్డి, ఏపీఎం అనసూయ లబ్ధిదారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు పొడిగింపు

ప్రశాంతి నిలయం: జర్నలిస్టుల అక్రిడిటేషన్ కాల పరిమితిని రెండు నెలలు పొడిగిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డీపీఆర్వో ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో మంజూరు చేసిన అక్రిడిటేషన్ కాల పరిమితి డిసెంబర్ 31తో ముగిసింది. తాజా నిర్ణయంతో ఫిబ్రవరి 28వ తేదీ వరకు గడువు పొడిగిస్తున్నట్లు తెలిపారు.

మెరుగైన వైద్యసేవలందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారిణి ఫైరోజ్ బేగం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారిణి ఫైరోజ్ బేగం మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. టీకాల నిల్వ, రక్త పరీక్షలు, ఓపీ రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యుడు ఓంకార్, జిల్లా సీనియర్ అసిస్టెంట్ బాబా, ఫక్రుద్దీన్, హెల్త్ సూపర్ వైజర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.
పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిని డీఎంహెచ్‌ఓ ఫైరోజ్‌బేగం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి సిబ్బందితో పలు విషయాలపై చర్చించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది విధుల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఆమె వెంకటరెడ్డిపల్లి సబ్‌సెంటర్‌ను తనిఖీ చేశారు.

న్యూ ఇయర్ జోష్..



హిందూపురంలోని సీఎస్ఐ చర్చి వద్ద సంబరాలు ఇలా...

ఆనందం ఆకాశాన్నంటింది. ఉత్సాహం ఉరకలేసింది. డీజే శబ్దాలు మిన్నంటాయి. శుభాకాంక్షల వెల్లువ కురిసింది. ఎన్నో అనుభూతులను, అనుభవాలను పంచిన 2024 సంవత్సరం ఇక సెలవంటూ మాయమైపోగా.. 2025 ఏడాది మరింత కొత్తగా వచ్చేసింది. నూతన సంవత్సరానికి ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు ఘన స్వాగతం పలికారు. కోటి కోరికలతో సాదరంగా ఆహ్వానించారు. మంగళవారం సాయంత్రం నుంచే న్యూ ఇయర్ సంబరాలు మొదలయ్యాయి. సరిగ్గా అర్ధరాత్రి 12 గంటలకు 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ మార్మోగించారు. స్నేహితులు, బంధువులు, శ్రేయోభిలాషులకు పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇష్టదైవాన్ని దర్శించుకునేందుకు ఆలయాలకు క్యూకట్టారు. మరోవైపు, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కొనుగోలుదారులతో దుస్తుల దుకాణాలు, బేకరీ షాపులు కిటకిటలాడాయి.

– సాక్షి బృందం



అనంతపురంలోని టవర్‌క్లాక్ సెంటర్ వద్ద యువత సందడి



హిందూపురం అంబేద్కర్ సర్కిల్‌లో పోలీసుల ఆధ్వర్యంలో...



హిందూపురంలో ఓ బేకరీ వద్ద కొనుగోలుదారుల రద్దీ



నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా అర్ధరాత్రి కేక్ కట్ చేస్తున్న ఓ కుటుంబం

ఆశల ఏడాది.. శ్రమిద్దామా మరి!

- కొత్త ఏడాది.. కొన్ని నిర్ణయాలు
- కార్యాచరణ ఉంటేనే కెరీర్‌కు బాటలు
- కఠిన నిర్ణయాల అమలుతోనే జీవితంలో వెలుగులు
- గడిచిన మధుర స్మృతులే తీపి గురుతులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: నూతన సంవత్సరం.. కొత్త కొత్త ఆలోచనలు..అనుభూతులు.. ఈ ఏడాది ఏదో ఒకటి చేయాలనే తపన. ఏం చేద్దామనే ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరి. 'ఈ రోజు నుంచి నేను మద్యం ముట్టను' అంటూ భీష్మ ప్రతిజ్ఞ చేసే వాళ్లు కొందరు.. 'నేను మాంసం అసలే తినను' అంటూ కరాఖండీగా చెప్పేవాళ్లు ఇంకొందరు.. 'ఏది ఏమైనా జూదం జోలికి వెళ్లను' అంటూ మరొకరు... ఇక.. 'ఈ ఏడాదైనా పెళ్లి భాగ్యం కలుగుతుందో? లేదో' అంటూ ముక్కోటి దేవుళ్లకు మొక్కే యువతీ యువకులు చాలా మందే ఉన్నారు. కొత్త ఏడాది కలిసొస్తుందేమోనన్న ఆశలతో ముందుకు సాగుతూ డిసెంబర్ 31కి వీడ్కోలు చెబుతుంటారు. అయితే, మరుసటి రోజు షరా మామూలే అన్నట్టుంటే విలువేముంటుందనేది డాలర్ల ప్రశ్న.

కార్యాచరణ తప్పనిసరి..

కొత్త ఏడాది కలలు కనడం, కోర్కెలు సాకారం చేసుకోవడం అటుంచితే అనుకున్న విషయాలను అమలు చేయడానికి కార్యాచరణ లేకే చాలామంది వెనుకబడుతున్నారు. కఠిన నిర్ణయాలు తీసుకున్నప్పుడు అవి కష్టమైనా.. కార్యాచరణ ఉంటేనే సాకారమవుతాయనేది గుర్తుంచుకోవాలి. సమయ పాలన, ఓర్పు, నేర్పుతో ముందుకెళితేనే కొత్త ఏడాదికి అర్థముంటుంది.

పోటీ తీవ్రత..

కెరీర్‌లో స్థిరపడాలనుకునే యువతకు కెరీర్‌తో పాటు సమయమూ ముఖ్యమే. కోర్కెలు కోరి దేవుడి మీద వదిలేస్తే తీరవనేది తెలిసిందే. ఒక్క ఏడాది వృథా అయితే వచ్చే ఏడాదిలో పోటీగా లక్ష మంది అదనంగా చేరతారు. దీన్నిబట్టి ఈరోజు నుంచే కెరీర్‌పై దృష్టి పెట్టి సమయాన్ని వృథా చేసుకోకుండా కాలంతో పరుగులు పెట్టాలి.

అసలు సిసలు నిర్వచనం..

పనులు వాయిదా వేస్తున్నప్పుడే ఒత్తిడి పెరుగుతుందనే విషయం గుర్తుంచుకోవాలి. ఈరోజు పాఠం ఈరోజే.. ఈ రోజు పని ఈరోజే చేస్తే ఒత్తిడి ఉండదు. 'వాయిదా' అనే జాడ్యం మనిషిని నిలువెల్లా దహించి వేస్తుంది. దీనివల్ల ఒత్తిడి కొండలా పెరిగిపోతోంది. ఈ క్రమంలో వాయిదా పద్ధతులకు సత్వరమే స్వస్తి పలకాలని గట్టిగా నిర్ణయించుకోవాలి.కాల గమనంలో ఎన్నో సంవత్సరాలు వస్తూ పోతూ ఉండటం సహజం. ''కావాల్సిందల్లా కాలంతో పోటీపడగలిగే శక్తిని ప్రోది చేసుకోవడం.. దానికోసం సమయం వృథాచేసుకోకుండా నిత్యం శ్రమించడం..'' ఇదే కొత్త ఏడాదికి అసలు సిసలు నిర్వచనం.

మొబైల్‌లోనే సగం కాలం..



కాలాన్ని వృథా చేయడమంటే మనల్ని మనం పణంగా పెట్టుకోవడమే. మొబైల్ వచ్చిన తర్వాత 70 శాతం యువత కాలాన్ని మొబైల్‌తోనే వృథా చేసుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల పేరుతో సగటున రోజుకు 4 గంటల సమయం వృథా అవుతున్నట్లు తేలింది. అంటే ఏడాదికి 60 రోజులు వృథా అయినట్టు లెక్క. కొత్త ఏడాది నుంచైనా యువత దీన్నుంచి బయటపడాలి.

ఆరోగ్యానికి సమయం...



చిట్‌చాట్‌లు, మొబైల్ చాటింగ్‌లకు సమయం కేటాయిస్తారు కానీ.. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం లేదు. ఈ కారణంగానే 30 ఏళ్లకే యువతలో గుండెపోటు కేసులు నమోదవుతున్నాయి. కొత్త ఏడాదిలో ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవాలంటే వ్యాయామం మొదలెట్టాలి. 'ఈరోజు నుంచే' అనే పట్టుదలతో ముందుకెళ్లాలి.

ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



పెనుకొండ రూరల్: నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా ప్రజలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి కోర్కెలు నెరవేరాలని, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో అందరూ సంతోషంగా జీవించాలని దేవుడిని వేడుకుంటున్నట్లు తెలిపారు.

ఫిబ్రవరి 28లోపు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

ప్రశాంతి నిలయం: జిల్లా పరిధిలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు అందరూ 2025కు సంబంధించి లైఫ్ సర్టిఫికెట్‌ను ఫిబ్రవరి 28వ తేదీలోపు సమర్పించాలని జిల్లా ఖజానా అధికారి నాగమల్లిక ఒక ప్రకటనలో సూచించారు. సమీపంలోని ఉప ఖజానా కార్యాలయంలోగాని, మీసేవ ద్వారా గాని ఆన్‌లైన్‌లో ద్వారా జీవన్ ప్రమాణ పోర్టల్ ద్వారా సమర్పించవచ్చన్నారు. జీవిత ధ్రువీకరణ పత్రం పొందేందుకు ఆధార్ కార్డు, సెల్‌ఫోన్, పీపీఓ నంబర్ కోసం పెన్షన్ పుస్తకం తీసుకురావాలని సూచించారు.

ప్రధాని మోదీతో ముఖాముఖి అవకాశం

- విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: ''దేశ ప్రధానమంత్రితో ముఖాముఖి పాల్గొనే అరుదైన అవకాశం. 6–12 తరగతులు చదువుతున్న విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు 'పరీక్షపే చర్చ–2025' కార్యక్రమం ద్వారా ప్రధానిని కలుసుకునే అవకాశం కల్పించారు. ప్రధాని నరేంద్రమోదీ చొరవతో రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమం కొన్నేళ్లుగా కొనసాగుతోంది. ప్రస్తుత విద్యాపరమైన సవాళ్లకు చక్కటి పరిష్కారాలు కనుగొనే 'పరీక్ష పే చర్చ' వేదికపై తమ అభిప్రాయాలను, అనుమానాలను పంచుకోవచ్చు' అని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు సూచించారు. విద్యాపరమైన సవాళ్లకు వినూత్న పరిష్కారాలను చర్చించడానికి, స్ఫూర్తిదాయకమైన కథనాలను పంచుకోవడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఇదో చక్కటి వేదికగా నిలుస్తుందన్నారు. 'పరీక్ష ఒత్తిడిని తగ్గించడం', 'సమర్థవంతమైన సమయ నిర్వహణ', 'వినూత్న అభ్యసన పద్ధతులు', 'విద్యలో సాంకేతికత ప్రాముఖ్యత–పాత్ర', 'విద్యావేత్తలకు తల్లిదండ్రుల మద్దతు' అంశాలపై వృత్తిపరమైన సూచనల కోసం ప్రశ్నలు ఆన్‌లైన్‌లో పంపాలని పేర్కొన్నారు. https://innovateindia1.mygov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 14 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కోసం డైట్ అధ్యాపకులు, 'పరీక్ష పే చర్చ' నోడల్ అధికారులు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ 99499 93712, ఎం.లక్ష్మీనారాయణరెడ్డి (అనంతపురం) 83280 12659, పోలా లక్ష్మీనారాయణ (శ్రీ సత్యసాయి) 94409 44737ను సంప్రదించాలని కోరారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు తమ దృక్కోణాలను పంచుకునేందుకు, సమర్థవంతమైన పరస్పర చర్యల నుంచి నేర్చుకునేందుకు ఈ అద్భుతమైన అవకాశాన్ని వినియోగించుకోవాలని డీఈఓ విజ్ఞప్తి చేశారు. జాతీయస్థాయిలో ఈ కార్యక్రమానికి గల ప్రాధాన్యత దృష్ట్యా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వీలైనంత ఎక్కువమంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్వీట్ దుకాణాల్లో మోసం

- 14 కేసుల నమోదు



పుట్టపర్తి అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు పట్టణాల్లో ఏర్పాటు చేసిన స్వీట్ దుకాణాల్లో లీగల్ మెట్రాలజీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతపురం, నార్పల, బత్తలపల్లి, ధర్మవరం, పుట్టపర్తిలో దాడులు నిర్వహించి తక్కువ తూకం (ఒక కేజీకి 200 గ్రాములు తక్కువ) ఉండటాన్ని గుర్తించారు. అనంతపురంలో 4, బత్తలపల్లిలో 2, ధర్మవరంలో 2 కేసులు నమోదు చేశారు. ప్యాకేజీ తినుబండారంపై తయారీ దారులు, పూర్తి చిరునామా, తయారీ నెల, సంవత్సరం, ఎంఆర్‌పీ, వినియోగదారుడు ఫిర్యాదు చేయడానికి ఉండాల్సిన పేరు చిరునామా, ఫోన్ నంబర్, ఈ మెయిల్ ఐడీ తదితర వివరాలను ముద్రించకపోవడం, కూల్ డ్రింకులు అధిక ధరలకు అమ్ముతున్నందుకు 5 కేసులు మొత్తం 14 కేసులు నమోదు చేశారు. అందులో 7 కేసులకు రూ.38 వేల జరిమానా విధించారు. తనిఖీల్లో లీగల్ మెట్రాలజీ అధికారి మహమ్మద్ గౌస్, టెక్నికల్ అసిస్టెంట్ మహమ్మద్ పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో నూతన వేడుకలు



సంగీత కచేరీ నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థులు



వేడుకల్లో పాల్గొన్న సినీనటి సాయి పల్లవి

- వేడుకల్లో పాల్గొన్న సినీనటి సాయి పల్లవి

ప్రశాంతి నిలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో నూతన సంవత్సర వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. సత్యసాయి విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, భక్తులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఉదయం సత్యసాయి మహాసమాధి వద్ద సత్యసాయి హయ్యర్ సెకండరీ స్కూల్ పూర్వ విద్యార్థులు 'అనంతం సాయిశ్వరం' పేరుతో సంగీత కచేరీ నిర్వహించారు. సాయంత్రం ''సమస్త సాక్షిమ్ తమష్ పరస్థత్' పేరుతో నాటిక ప్రదర్శించారు. మానవుడు తనలోని చెడు గుణాలను త్యజించి సత్య నిష్ఠతో జీవిస్తే దేవుడిని చేరుకోగలడన్న సందేశాన్నిచ్చారు. పురాణ ఇతిహాసాల నుంచి పలు ఘట్టాలను చక్కగా ప్రదర్శించారు.

వేడుకల్లో పాల్గొన్న సినీనటి సాయిపల్లవి

ప్రశాంతి నిలయంలో మంగళవారం జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ప్రముఖ సినీనటి సాయి పల్లవి పాల్గొన్నారు. సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. ప్రశాంతి నిలయానికి విచ్చేసిన ఆమెకు సత్యసాయి ట్రస్ట్ వర్గాలు ఘన స్వాగతం పలికాయి. సాయి పల్లవిని చూసేందుకు స్థానికులు, భక్తులు ఆసక్తి చూపారు.



నాటికలో ఓ ఘట్టం



విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఫ్రెండ్‌షిప్ సిరీస్ విజేత పీకే స్పోర్ట్స్

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా అండర్–14 హట్‌హాక్స్ న్యూజిలాండ్, పీకే స్పోర్ట్స్ టీమ్ – హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన ఫ్రెండ్‌షిప్ సిరీస్‌ను పీకే స్పోర్ట్స్ హైదరాబాద్ జట్టు దక్కించుకుంది. రెండు జట్లు మూడు వన్డే మ్యాచ్‌లు ఆడగా, హైదరాబాద్ మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించింది. మంగళవారం జరిగిన చివరి వన్‌డేలో హట్‌హాక్స్ పది వికెట్ల నష్టానికి 194 పరుగులు చేయగా, పీకే స్పోర్ట్స్ నాలుగు వికెట్ల నష్టానికి 197 పరుగులు సాధించింది.

డబుల్ కిక్కు!



- నగటున రోజూ రూ.6 కోట్ల విలువైన మద్యం విక్రయాలు
- డిసెంబర్ 31న ఒకే రోజు రూ.11.50 కోట్ల మద్యం సరఫరా
- చివరకు ఆస్పత్రుల్లోనూ మద్యం హోర్డింగ్‌ల ఏర్పాటుతో సామాన్యుల విస్మయం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఇప్పటికే బెల్టుషాపులు, పర్మిట్ రూముల పేరుతో పల్లెల్లో మద్యం ఏరులై పారిస్తున్న కూటమి సర్కారు... కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే సందర్భంగా మరింత ముందడుగు వేసింది. పాత సంవత్సరానికి వీడ్కోలు పలికే డిసెంబరు 31ని దృష్టిలో ఉంచుకుని మద్యం వినియోగం పెరుగుతుందని భారీగా సరఫరా చేసింది.

తాగుతూ.. తూలుతూ..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సగటున రోజూ రూ.6 కోట్ల విలువైన మద్యాన్ని అనుమతి పొందిన దుకాణాలకు సరఫరా అయ్యేది. ఈ క్రమంలో డిసెంబర్ 30వ తేదీ అర్ధరాత్రి వరకూ రమారమి రూ.11.50 కోట్ల మద్యాన్ని షాపులకు స్టాకు పంపించారు. ఏ ఒక్క మద్యం షాపులో కానీ, బార్‌లో కానీ ఒక్క బాటిల్ కూడా తక్కువ రాకుండా చూసుకోవాలన్న ఉద్దేశ్యంతో సర్కారు భారీగా స్టాకు పంపింది. దాదాపుగా రోజూ ఇచ్చే అమ్మకాల ఆర్డర్‌తో పోలిస్తే ఇది వందశాతం ఎక్కువగా ఉండడం గమనార్హం. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచే మద్యం ప్రియులు షాపుల వద్ద బారులు తీరి తమకు కావాల్సిన బ్రాండ్‌లను కొనుగోలు చేశారు. రాత్రి 12 గంటల వరకూ ఇష్టారాజ్యంగా తాగుతూ తూలుతూ కనిపించారు. యువత కేకలు, టూవీలర్ల రైడింగ్‌తో రహదారులు హోరెత్తి పోయాయి.

ఆస్పత్రులనూ వదలని కూటమి కిక్కు

బడికి.. గుడికీ తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ షాపులు పెట్టి మద్యం కిక్కు ఎక్కించిన కూటమి సర్కారు... తాజాగా ఆస్పత్రులనూ వదల్లేదు. అనంతపురం నగరంలోని ఆస్పత్రి వద్ద ఏకంగా 'రవీంద్ర' వైన్స్ పేరుతో పెద్ద హోర్డింగ్ ఏర్పాటు చేశారు. ఆస్పత్రి గోడకు ఆనుకుని దీనిని ఏర్పాటు చేయడంతో పేషెంట్లు విస్తుపోతున్నారు. కనీసం పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఈ హోర్డింగ్‌ను తీసెయ్యలేదు. చిన్నపాటి ఫ్లెక్సీ కడితే తీసేసే మున్సిపల్ అధికారులూ సైతం స్పందించలేదు. ఎక్కడ పడితే అక్కడ మద్యం షాపుల హోర్డింగ్‌లతో జనాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.



అనంతపురంలోని రెవెన్యూ కాలనీ వద్ద 'ఆయుష్మాన్ భారత్' హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం ఫ్లెక్సీ



అనంతపురంలోని ఓ మద్యం దుకాణం వద్ద కొనుగోలుదారుల రద్దీ

డిసెంబర్ 31 కోసం లిక్కర్ డిపో నుంచి సరఫరా అయిన మద్యం వివరాలు..

అనంతపురం జిల్లాలో	
లిక్కర్ కేసులు	9,674
బీర్ కేసులు	3,794
మొత్తం విలువ	రూ.7,61,38,630

శ్రీసత్యసాయి జిల్లాలో	
లిక్కర్ కేసులు	5,193
బీర్ కేసులు	2,467
మొత్తం విలువ	రూ.3,87,38,076

రెండు జిల్లాల్లో సరఫరా చేసిన మద్యం మొత్తం విలువ
రూ.11,48,76,707



మరణించినా.. మహోపకారం

- వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి మృతి
- నేత్రదానంతో మరో నలుగురికి చూపు



ధర్మవరానికి చెందిన శివానంద (ఫైల్)



నేత్రదానం చేసినట్లు ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న సందీప్ కుటుంబసభ్యులు

ధర్మవరం అర్బన్/కూడేరు: మరణానంతరం నేత్రదానం చేసి మరో నలుగురికి చూపును ప్రసాదించారు కూడేరు మండలం చోళసముద్రానికి చెందిన సంజీయరాయుడు కుమారుడు సందీప్ (35), ధర్మవరంలోని పీఆర్‌టీ వీధికి చెందిన శింగనమల శివానంద (78). వివరాలు... సోమవారం రాత్రి తమ పొలంలో కొబ్బరి చెట్టు పట్టలు తొలగిస్తూ లింగంశెట్టి సందీప్ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం అనంతపురంలోని సర్వజన ఆస్పత్రిలో సందీప్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వారు సందీప్ కుటుంబసభ్యులతో మాట్లాడారు. మరణానంతరం నేత్రదానంతో మరో ఇద్దరికి కంటి చూపును ప్రసాదించవచ్చునని తెలిపారు. కుటుంబసభ్యుల అనుమతితో సందీప్ మృతదేహం నుంచి నేత్రాలను సేకరించి, ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

- అనారోగ్యంతో బాధపడుతున్న ధర్మవరంలోని పీఆర్‌టీ వీధికి చెందిన శింగనమల శివానంద మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ బీవీ సుబ్బారావు, వైకే శ్రీనివాసులు... ఆస్పత్రి వద్దకు చేరుకుని నేత్రదానం ఆవశ్యకతపై బాధిత కుటుంబసభ్యులను చైతన్య పరిచారు. అనంతరం మృతుడి కుమారుడు శివకిషోర్, వెంకటమహేస్ అంగీకరించడంతో శివానంద నేత్రాలను సేకరించి ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌కు పంపారు. నేత్రదానం చేసిన మృతుని కుటుంబ సభ్యులకు యువర్స్ ఫౌండేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య



కరియమ్మ మృతదేహం

పరిగి: స్థానిక 90 ఇండ్ల కాలనీకి చెందిన కరియమ్మ(60) ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపిన మేరకు.... ఎస్సీ కాలనీకి చెందిన కరియమ్మ... తన కుమారుడితో కలిసి ఉంటోంది. మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆ క్రమంలో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. సాయంత్రం పరిగి చెరువులో ఓ మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, వెలికి తీయించారు. మృతురాలిని కరియమ్మగా కుటుంబసభ్యులు నిర్ధారించారు. ఆమె కుమారుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఆమె మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

తలుపుల: మండలంలోని వేమలగొంది సమీపంలో ఆర్డీటీ చెక్‌డ్యాం వద్ద కోడి పందెం ఆడుతున్న 28 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు. అందిన సమాచారం మేరకు మంగళవారం తనిఖీలు చేపట్టిన సమయంలో పోలీసులను గమనించిన జూదరులు పరారయ్యారన్నారు. దీంతో పోలీసులు వెంటాడి 28 మందిని అదుపులోకి తీసుకోగా, ఇద్దరు పరారయ్యారన్నారు. నిందితులను అరెస్ట్ చేసి, రూ.22,200 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు, ఓ ఆటో, 20 సెల్‌ఫోన్లు, 12 పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

యంత్రంలో చిక్కుకున్న కార్మికుడి చెయ్యి

హిందూపురం: స్థానిక తూముకుంట పారిశ్రామికవాడలోని రోల్వేల్ కన్వేయర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం ప్రమాదం చోటు చేసుకుని ఓ కార్మికుడు వైకల్యం బారిన పడ్డాడు. వివరాలు... పరిశ్రమలో సీఎన్‌సీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రామాంజనేయులు మంగళవారం పనిలో నిమగ్నమై ఉన్నప్పుడు ప్రమాదవశాత్తు కుడి చెయ్యి యంత్రంలో చిక్కుకుంది. ప్రమాదాన్ని గుర్తించి తోటి కార్మికులు యంత్రాన్ని ఆపేలోపు రెండు వేళ్లు పూర్తిగా తెగిపడ్డాయి. మరో వేలు ఛిద్రమైంది. బాధితుడిని తూముకుంట పారిశ్రామికవాడ కార్మిక సంఘం అధ్యక్షుడు రవికుమార్, తోటి కార్మికులు వెంటనే స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అంతరం మెరుగైన కోసం బెంగళూరుకు తరలించారు. కార్మికుడికి మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా యాజమాన్యాన్ని కార్మిక సంఘం నేతలు కోరారు.

రిజర్వాయర్‌లో పడి యువకుడి మృతి



ఫలణిస్వామి మృతదేహం

పెనుకొండ రూరల్: తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన ఓ యువకుడు గొల్లపల్లి రిజర్వాయర్‌లో పడి మృతి చెందాడు. మృతుడిని కోయంబత్తూరులోని సిద్ధాపుదుర్ నందగోపాల్ మొదటి స్ట్రీట్‌కి చెందిన సంతోష్ ఫలణిస్వామి(23)గా ప్రాథమికంగా నిర్ధారించినట్లు కియా పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనాల సీజ్

పెనుకొండ: నూతన సంవత్సరం సందర్భంగా యువత జోరుకు కల్లెం వేస్తూ పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఇటీవల బైక్ రేస్‌లు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై ముందస్తుగా అనుమానిత యువకుల ద్విచక్ర వాహనాలను మంగళవారం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ముందస్తుగా రికార్డులు పరిశీలించి, సక్రమంగా లేని ఆరు వాహనాలను సీజ్ చేసినట్లు వివరించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి బైక్ రేస్‌లు, వీలింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

మద్యం అక్రమ రవాణాదారుడి అరెస్ట్

పెనుకొండ రూరల్: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) అధికారులు అరెస్ట్ చేశారు. వివరాలు.. మంగళవారం ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 288 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని గోరంట్ల మండలం వానవోలు క్రాస్ సమీపంలో నవాబు కోట గ్రామానికి చెందిన తిరుపాల్‌ను అరెస్ట్ చేసినట్లు వివరించారు. ఆటోను సీజ్ చేసినట్లు ఎస్టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతుడు ధనుంజయ

ధర్మవరం అర్బన్: విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని ఎర్రగుంటకు చెందిన ధనుంజయ (40)కు భార్య అరుణ, ఇద్దరు కుమారులు ఉన్నారు. బార్బర్ షాప్ ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో నూతన సంవత్సర వేడుక సందర్భంగా తన బార్బర్ షాప్‌ను మంగళవారం రాత్రి ధనుంజయ ముస్తాబు చేశాడు. చివరన బోర్డు అమరుస్తుండగా ప్రమాదవశాత్తు పైనున్న విద్యుత్ మెయిన్ లైన్ తీగలు తగలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని మహిళ మృతి



షానూబేగం మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త బాషా సాహెబ్

చిలమత్తూరు: కారు ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురంలోని మేళాపురం ప్రాంతానికి చెందిన షానూబేగం(50), షేక్ బాషా సాహెబ్ దంపతులు సోమవారం చిలమత్తూరు మండలం శెట్టిపల్లిలోని దర్గాకు వచ్చారు. రాత్రి దర్గాలోనే విడిది చేసిన వారు మంగళవారం ఉదయం హిందూపురానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. ఘటనలో కింద పడిన షానూబేగం అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన బాషా సాహెబ్‌ను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు.